# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 24 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు రోజ్ గార్ మేళాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలను అందించనున్నారు.**
2. **కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
3. **ప్రభుత్వాసుప్రతుల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత లేదని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**
4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 130వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది.**

-----------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు 18వ రోజ్‌గార్ మేళాలో వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో కొత్తగా నియమితులైన యువతకు 61 వేలకుపైగా నియామక పత్రాలను దృశ్యమాధ్యమ విధానంలో పంపిణీ చేయనున్నారు. రోజ్ గార్ మేళాలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా 11 లక్షలకు పైగా నియామక పత్రాలు అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. 18వ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 45 ప్రదేశాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. కేంద్ర హోం, ఆరోగ్య,

కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు, ఆర్థిక సేవలు, ఉన్నత విద్యా విభాగాలు వంటి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారని పేర్కొన్నారు.

-----------------------

కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలను నిర్వహించాలని, అధికార యంత్రాంగం ఇందుకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పుష్కరాలకు సంబంధించిన పనులను అన్ని శాఖలు వెంటనే ప్రారంభించాలన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పుష్కరాలపై సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకూ జరగనున్న పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి 10 కోట్ల మంది పుష్కర పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే అవకాశం ఉన్నందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అందుకు తగినట్లు వసతులు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 212 కి.మీ. మేర గోదావరి నది ప్రవహిస్తున్నందున.. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతోనూ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు.

-----------------------

ప్రభుత్వాసుప్రతుల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత లేదని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవల్లో ఖమ్మం రాష్ట్రంలోనే ముందు

వరుసలో ఉందని తెలిపారు. ప్రభుత్వాసుప్రతుల్లోను నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయనే భావన ప్రజల్లో తీసుకురావాలని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

-----------------------

వినియోగదారులకు నాణ్యమైన, చవకైన విద్యుత్తును అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో విద్యుత్తు ఉపకేంద్రాన్ని మంత్రి కొలుసు పార్థసారధితో కలిని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్తు రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్లు, ట్రాన్స్ మిషన్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థల ఆధునీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. అంతరాయాలను తగ్గించి, సాంకేతిక నష్టాలను నియంత్రించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.

-----------------------

రాజధాని అమరావతిలో తొలిసారి జరుగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. 22 ఎకరాల్లో పెరేడ్ గ్రౌండ్, వీవీఐపీ, వీఐపీ పార్కింగ్ కు 15 ఎకరాలు, పబ్లిక్ పార్కింగ్ కు 25 ఎకరాలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. అమరావతి రైతులకు ప్రత్యేకంగా

వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు హాజరుకావలసిందిగా అధికారులు రైతులకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నామని తెలిపారు. వేడుకలకు 13 వేల మంది హాజరవుతారని భావిస్తున్నామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

----------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

----------------------

రాష్ట్రంలో 71 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతులకు బోనస్ గా 19 వేల కోట్ల రూపాయలను అందించామన్నారు. సూర్యాపేట జిల్లా, మట్టపల్లి గ్రామంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ లతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 85 శాతం మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేశామని తెలిపారు.

----------------------

పేదరికం లేని జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్ లో నిన్న

నిర్వహించారు. కేంద్రం నిధులతో అమలయ్యే సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి పై వివిధ శాఖల అధికారులతో  పార్లమెంట్ సభ్యులు సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...

వాయిస్..30 సెకన్లు

-----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకూ.. 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు"-స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత వాతావరణంపై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ, శ్రమదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

-----------------------

ఆంధ్ర ప్రదేశ్, యానాంలలోని దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాంలలో  ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి జి.లక్ష్మీ పేర్కొన్నారు. ఒకటి, రెండు చోట్ల మోస్తరు పొగమంచు కురిసే అవకాశం ఉందన్నారు. దక్షిణ కోస్తా,

రాలయసీమల్లో పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపారు. వచ్చే 5 రోజుల పాటు కనిష్ట ఉష్ణోగ్రతలలో పెద్దగా మార్పులు ఉండదని వెల్లడించారు.

మరోవైపు తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది.

------------------------

విశాఖ ఉత్సవ్ ఈ రోజు నుంచి వచ్చే నెల 1 తేదీ వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ వేడుకకు సుమారు 10 లక్షల మంది పర్యాటకులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. కలెక్టరేట్ లో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విశాఖ ఉత్సవ్ లో భాగంగా ఉదయం వేళల్లో బోటింగ్, బీచ్ వాలీబాల్, కబడ్డీ, హెలికాప్టర్ రైడ్స్, సైక్లింగ్, యోగా పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం స్థానిక కళాకారులు, జాతీయ స్థాయి సినీ తారలు మరియు లైవ్ బ్యాండ్ల చేత అద్భుత ప్రదర్శనలు, విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు, కామెడీ షోలు, నైట్ మార్కెట్లు, సంగీత విభావరిలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక ఆకర్షణగా డ్రోన్ షోలు, బాణసంచా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

========================